క్లుప్తంగా

60 మందికి దంత పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న సాయి డెంటల్ ఆస్పత్రి వైద్యులు

నరసన్నపేట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని సర్పంచ్ బి.శంకర్ ప్రారంభించారు. శ్రీకాకుళం సాయి డెంటల్ ఆస్పత్రి సిబ్బంది 60 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి సంబంధించిన దంత రోగులు వచ్చి తనిఖీలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్(బుజ్జి), బి.ఎల్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వంట పాత్రల వితరణ



వంట పాత్రలను అందజేస్తున్న ముకుందరావు కుటుంబ సభ్యులు

కొత్తూరు: మండలంలోని మహసింగి గ్రామ సమీపంలో ఉన్న వరహా లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఎస్ఎన్ కాలనీకి చెందిన ఆశపు ముకుందరావు, పుష్పలత దంపతులు రూ.51 వేల విలువైన వంట పాత్రలను బుధవారం అందజేశారు. మనమరాలు మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు వంట పాత్రలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముకుందరావు తల్లిదండ్రులు కాళిదాసు, వరలక్ష్మిని, కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు గోగుల వరప్రసాద రావునాయుడు, భానోజీరావు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మేలు



మాట్లాడుతున్న ఏడీ రవీంద్రభారతి

నరసన్నపేట: రైతులు ఖరీఫ్ సీజన్‌లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి అన్నారు. మండలంలోని దూకులపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి విత్తనాలను శుద్ధి చేసుకోవాలన్నారు. అదనపు ఆదాయానికి పొలం గట్లపై కంది పంట వేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కలుపు నివారణ పద్ధతులు పాటించాలని, కాలి బాటలు తీయాలని, మందుల పిచికారీలో డ్రోన్లు వినియోగం మేలని సూచించారు. ఏఓ సూర్యకుమారి, సర్పంచ్ అల్లు అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

పాతపట్నం: అర్హత ఉన్న గిరిజనులు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు అన్నారు. మండలంలోని సవర సిద్ధమనుగులో దర్తి జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. ఎంపీడీఓ పి.చంద్రకుమారి, సీఎస్ డీటీ బి.కుమారి, ఏపీఓ సురేష్, హౌసింగ్ ఏఈ సీతారామరాజు, సర్పంచ్ సవర సింధు, కేలం కామేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలాభివృద్ధే లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం: గిరిజన గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని మర్రిగూడ గిరిజన గ్రామంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, తహసీల్దార్ హనుమంతురావు, ఎంఈఓ రాంబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, జెడ్పీటీసీ పి.బుచ్చిబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్నాథుని రథయాత్రకు.. సర్వం సిద్ధం



ఎల్.ఎన్.పేటలో జగన్నాథ స్వామి ఆలయం



సిద్ధం చేస్తున్న రథం

- ఆలయాల ముస్తాబు
- ఈ నెల 27న రథయాత్ర

ఎల్.ఎన్.పేట: భక్తుల నుంచి నిత్యం పూజలు అందుకుంటున్న జగన్నాథుని రథయాత్రకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27వ తేదీన పూరిలో కొలువైన జగన్నాథ స్వామి రథయాత్ర కావడంతో ఆదే రోజున పాతపట్నం నియోజకవర్గంలో రథ యాత్ర చేసేందుకు ఆయా మండలాల్లోని జగన్నాథ స్వామి, రాధాకాంత స్వామి ఆలయాల అర్చకులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే ఆలయాలను ముస్తాబు చేయటంతో పాటు రథాలను సిద్ధం చేశారు. జగన్నాథ స్వామితోపాటు కొలువై పూజలు అందుకుంటున్న సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్ర సమేతంగా ప్రధాన ఆలయం నుంచి గుండిచా మందిరం వరకు రథయాత్ర రోజున తరలివెళ్తారు.

దశ అవతారాల్లో...

ప్రధాన ఆలయం నుంచి గుండిచా మందిరానికి రథయాత్ర రోజున తరలివెళ్లిన జగన్నాథ స్వామి పది రోజులపాటు వివిధ అవతారాల్లో దర్శనమిచ్చి భక్తుల నుంచి పూజలు అందుకుంటారు. స్వామిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఈ నెల 27న జగన్నాథ స్వామి రథయాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. ప్రధాన ఆలయం నుంచి ఉత్తరదిశలో వంశధార నదీతీరంలో ఉన్న గుండిచా మందిరానికి జగన్నాథుడిని తీసుకుని వెళ్లి పది రోజుల పాటు అక్కడే పూజలు చేస్తాం. స్వామి దశ అవతారాల్లో దర్శనం ఇస్తారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేస్తారు.

– జగన్నాథ పత్రి,
జగన్నాథ స్వామి ఆలయ అర్చకులు,
లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

నియోజకవర్గంలో..

- ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల జగన్నాథ స్వామి ప్రధాన ఆలయం నుంచి గుండిచా మందిరం వరకు రథయత్ర రోజున తరలి వెళతారు.
- పాతపట్నం మండలంలోని జూబీహిల్స్ రోడ్డులో జగన్నాథుని రథయాత్ర భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.
- హిరమండలం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న జగన్నాథ స్వామి ఆలయం వద్ద రథయాత్రను ఘనంగా నిర్వహిస్తారు.

– కొత్తూరు మండలం నివగాంలో రాధా కాంత స్వామి ఆలయం వద్ద రథయాత్ర నిర్వహిస్తారు.



ప్రత్యేకంగా అలంకరించిన గుండిచా మందిరం

రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి..



సత్యవరంలో సిద్ధం చేసిన రథం



రథయాత్ర కోసం పెద్దపేటలోని రామాలయం వద్ద ఏర్పాట్లను సమీక్షిస్తున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరంలో జగన్నాథస్వామి రథోత్సవం ఈ నెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు, ఈఓ వసనాభి గాంధీ, మాధవి తెలిపారు. ఏటా ఈ రథోత్సవం పూరీ క్షేత్రంలో ప్రారంభించిన రోజే నరసన్నపేటలోని పెద్దపేట వీధిలో గల జగన్నాథ స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న స్వామి సత్యవరం నుంచి రథంపై పెద్దపేట ఆలయానికి ఊరేగింపుగా వెళ్తారు. జూలై 7వ తేదీ వరకు కొలువుతీది ఉంటారు. 8న తిరిగి మారు రథాయాత్ర ద్వారా సత్యవరం గ్రామానికి చేరుకుంటారు. పెద్దపేట ఆలయంలో రోజుకో అవతరాంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారరు. ఈ 9 రోజులూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

అవతారాలు ఇలా..

ఈ నెల 28న మత్స్య, 29న వరహా, 30న నరసింహా, జూలై 1న వామనా, 2న పరసురామ, 3న రామ, 4న కృష్ణ, 5న వెంకటేశ్వర అవరాతరంలో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఈ తొమ్మిది రోజులూ పెద్దపేట వద్ద యాత్ర నిర్వహిస్తారు. యాత్ర నిర్వహించే స్థలాన్ని సర్పంచ్ బి.శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు పి.ష్ణప్రసాద్ బుధవారం పరిశీలించారు. లకిమేరలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ రథయాత్ర నిర్వహించనున్నట్లు అర్చకులు సూర్యనారాయణ శర్మ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస:

ఈ నెల 27వ తేదీన ఆమదాలవలస పట్టణంలోని 33/11 కేవీ పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ వెంకటయ్యపేట ఫీడర్, 11 కేవీ అక్కులపేట (పొన్నంపేట) ఫీడర్‌లో విద్యుత్ స్తంభాల మార్పు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మున్సిపాలిటీ పరిధిలో తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఏపీ టిడ్కో, చంద్రహర్ష ఆక్వా, కేజీబీవీ స్కూల్, ఆర్.ఆర్ గ్రానైట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆమదాలవలస మండలంలోని మందాది, మందాది బ్రిక్, అక్కులపేట, సంతకొత్తవలస, చిన్న జొన్నవలస, పెద్ద జొన్నవలస, దన్నానపేట, మునగవలస, రామచంద్రపురం, పొన్నంపేట, గాజులకొల్లివలస ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రాగోలు సబ్ స్టేషన్‌లోనూ మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఆమదాలవలస మండల పరిధిలోని కొత్త రోడ్, తోటాడ, అక్కివరం, వంజంగి, దూసి తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: ఈ నెల 27వ తేదీన మండలంలోని గంగువాడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమత్తులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గంగువాడ, తెంబూరు, పెద్దలక్ష్మీపురం, వెంకటాపురం, బడ్డుమర్రి, లాబర, సింగుపురం, పెద్దలొగిడి, చిన్నలొగిడి, రట్టిని, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రూ.2 లక్షల ప్రమాద బీమా అందజేత



నీలవేణికి చెక్కును అందజేస్తున్న బ్యాంకు మెనేజర్, తదితరులు

హిరమండలం: మండలం కేంద్రానికి చెందిన బెవర నారాయణరావు ఇటీవల మృతి చెందారు. హిరమండలం ఏపీజీవీబీలో రూ.436లతో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి ధన్ యోజన పథకం కట్టారు. రూ.2 లక్షల బీమా చెక్కును నామిని అయిన మృతుడి భార్య బెవర నీలవేణికి బ్యాంకు మెనేజర్ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు బుధవారం అందజేశారు.

ఉపాధి అంతంతే..!

- వేతనదారులకు దొరకని పని
- పలు గ్రామాల్లో నెల రోజులుగా నిలిచి పోయిన పనులు
- సకాలంలో జమకాని బిల్లులు



అచ్చుతాపురం చేరువులో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

పాతపట్నం: గ్రామాల్లో ఉన్న పేదలకు పనులు కల్పించి వలసలను నివారించడమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం. అయితే ఈ ఏడాది వేతనదారులకు ఉపాధి అంతంతమాత్రంగానే కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మందికి మాత్రమే పని ఇచ్చారనే విమర్శలు అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో వేతనదారులకు పూర్తిస్థాయిలో కల్పించకపోవడం, వేతనాలు తక్కువగా రావడం, వేతనాలు నెలల తరబడి అందకపోవడంతో వేతనదారులు ఉపాధి పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. కొన్ని గ్రామాల్లో నెల రోజులుగా ఉపాధి పనులు నిలిపివేశారు. వేతనదారులకు పని దొరకని పరిస్థితి.

మళ్లీ వలసబాట..

ఉపాధి పథకం రాక ముందు పనుల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లేవారు. అటువంటి వారికి సొంత గ్రామాల్లో పనులు కల్పించడం కోసం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఉపాధి పనులు సక్రమంగా జరగక గ్రామాల నుంచి మళ్లీ పనుల కోసం వేతనదారులు పలు ప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు సమాచారం. పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలున్నాయి. ఇందులో మూడు మండలాల్లో వేతనదారులకు పని కల్పించడంలో వెనకబడింది.

పాతపట్నం నియోజకవర్గంలో ఏప్రిల్ నుంచి జూన్ 20 వరకు పని దినాల లక్ష్యం, కల్పించిన పని దినాలు

మండలం	పని దినాల లక్ష్యం	కల్పించిన పని దినాలు
పాతపట్నం	3,79,245	2,36,729
మెళియాపుట్టి	3,94,050	3,03,190
కొత్తూరు	3,53,345	4,39,350
హిరమండలం	2,59,210	1,81,955
ఎల్.ఎన్.పేట	2,29,316	2,73,747

సకాలంలో అందని బిల్లులు..

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వెళ్లే వేతనదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారం రోజుల్లో డబ్బులు జమ అయ్యేవి. కూటమి ప్రభుత్వం హయాంలో వేతనాలు సకాలంలో పడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలు అందలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారంతా పేదవారే. పనికి వెళ్తే వచ్చే ఆదాయం ద్వారా కుటుంబ పోషణ చేస్తారు. సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల ఉపాధి పనులు వదిలి ఇళ్ల పనులు, ఇటుక బట్టీ పనులకు వెళ్తున్నారు. ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించకపోవడం వల్ల వేతనదారులకు ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శత శాతమే లక్ష్యం



ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని శత శాతం సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు నాటికి పనిదినాలు లక్ష్యం, పని దినాలను వేతనదారులకు కల్పిస్తున్నాం.

– కె.సురేష్, ఏపీఓ, పాతపట్నం

వైఎస్ జగన్‌ను కలిసిన చింతాడ



మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం కలిశారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి రవికుమార్ హాజరయ్యారు. నియోజకవర్గంలోని పలు రాజకీయ అంశాలపై మాట్లాడినట్లు రవికుమార్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకు జగనన్న అభినందించారన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారన్నారు.

– ఆమదాలవలస

రోడ్డుపైనే మట్టి..



ఆమదాలవలస మండలంలోని కంచరాపువానిపేటలో రక్షిత మంచినీటి సరఫరా కోసం నాగావళి నది నుంచి ఆ గ్రామం వరకు పైపులైన్ తవ్వకాలు చేస్తున్నారు. తవ్విన మట్టిని రహదారిపై వేయటంతో వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పైపు లైన్ తవ్వకం చేసిన మట్టి పొలం పక్క వేయకుండా రహదారిపై వేయటం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. మట్టిని తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలని ఆ గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

సొంత మండలంలోనే బదిలీ చేయాలి



మెళియాపుట్టి: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



పొందూరు: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా పోలీసులు



పాతపట్నం: సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామసర్వేయర్లు

మెళియాపుట్టి: సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో విధులు నిర్వహించేలా అవకాశం కల్పించాలన్నారు. బుధవారం ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావుకు వినతిపత్రాలను సమర్పించారు. బదిలీ ప్రక్రియ వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే న్యాయపరంగా చేపట్టాలని, అర్హులకు ఇంక్రిమెంట్లు, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. అధికభారం మోపుతూ తమకు సంబంధంలేని విధులు కూడా చేయించడం సరికాదని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. మండలంలో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. సొంత మండలంలోనే బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. మండల పరిషత్ ఏఓ బసవ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ సర్వేయర్లు మూడు రోజులపాటు సామూహిక సెలవులు పెట్టదలచుకున్నామని గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు కె.ఉదయ్ కుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ తిరుపతి పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు సామూహిక సాధారణ సెలవులు పెడుతున్నామన్నారు.

పొందూరు మండలంలో..

పొందూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న బదిలీల ప్రక్రియలో రేషనలైజేషన్ పేరుతో తీవ్ర అన్యాయం చేస్తున్నారని సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ మన్మధరావుకు వినతిపత్రం అందజేశారు. లైన్ డిపార్ట్‌మెంట్ స్పష్టత ఇచ్చిన తర్వాతనే బదిలీలు చేపట్టాలన్నారు. సొంత మండలాల్లో ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ స్వామి నేత్రోత్సవం



నేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని అవలింగిలో గల జగన్నాథ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామి వారి నేత్రోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 27 నుంచి స్వామి వారి రథయాత్ర ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో స్వామి వారి నేత్రోత్సవం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ఆరుబయట ఏర్పాటు చేసి ఆలయ ధర్మకర్తల సమక్షంలో ప్రత్యేక పూజలు చేట్టారు.

పథకాలు అమలు చేయమంటే కేసులా?



రెడ్డి జ్యోతిలక్ష్మి, ఎంపీపీ, ఎల్.ఎన్.పేట

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయమంటే ప్రతిపక్ష నాయకులపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత కేసులు నమోదు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు పేరుతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు, అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా హామీలు అమలు చేయలేదన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు లేకుండా అధికారం కొనసాగించాలని అనుకోవటం దురదృష్టకరమన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు లేకుండా పథకం ప్రకారం తప్పుడు కేసులు బనాయిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం ఈ ఖరీఫ్ సీజన్‌లో అయినా ఇచ్చే పరిస్థితి ఉందా అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఏమయ్యాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైన తప్పుడు కేసులు నమోదు చేయటం బాధకరమన్నారు. మంత్రి లోకేష్ రచించిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతుందన్నారు.

సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

బూర్జ: పారదర్శకంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, ఎంపీపీ కర్నేన దీప అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు హాజహారయ్యారు. మండలంలో 1,417 పనులకు వేతనాలు రూ.17,35,61,275, మెటీరియల్ రూ.9,33,42,642 చెల్లించినట్లు ఏపీఓ ఐ.రవి తెలియజేశారు. పలు పంచాయతీల్లో కొలతల్లో తేడాలు, మస్టర్లలో కొట్టివేతలు, వేతనాల చెల్లింపులో తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఏపీపేట పంచాయతీలో జాబ్‌కార్డు అప్‌డేషన్ 2020 నుంచి లేదని, రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా లేదని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంతో ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలంపై గ్రామ సర్పంచ్ కె.సీతారామరాజు పీడీకి ఫిర్యాదు చేశారు. నీలాదేవిపురంలో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయకుండా సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించడంపై ప్రజావేదిక నిలుపుదల చేయాలని గ్రామస్తులు నిలదీశారు. అధికారులు, పోలీసులు కలుగజేసుకొని వివాదాన్ని సద్దుమణిగించారు. ఏపీడీ శైలజ, ఏపీడీ పి.రాధ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామ కంఠాన్ని పంచాయతీకి అప్పగించాలి

కొత్తూరు: మండలంలోని సోమరాజపురం-అంగూరు రోడ్డులో ఉన్న గ్రామ కంఠం 3.36 ఎకరాలను పంచాయతీకి అప్పగించాలని జిల్లా కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు సోమరాజపురం సర్పంచ్ శిమ్మ మల్లేశ్వరి బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామ కంఠాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకొని సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ కంఠాన్ని పంచాయతీకి అప్పగించాలని రెవెన్యూ అధికారులకు కోర్టు ఆదేశించినా అప్పగించడం లేదన్నారు. గ్రామ కంఠంలో ఆక్రమణదారుడు వరి విత్తనాలు వేసి సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమిని పంచాయతీకి అప్పగించాలన్నారు.